


# కరపత్రం

SINCE 2014

బుధవారం ఆగస్ట్ 05, 2026 | సంపుటి : 2 | సంచిక : 294 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## ప్రభుత్వ కార్యాలయాలకు
# టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

- సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ సేవలు
- ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ టీ-ఫైబర్
- ప్రైవేట్ ఇంటర్నెట్‌కు గుడ్‌బై
- టీ-స్వాన్‌కు బదులుగా టీ-ఫైబర్
- డిజిటల్ నెట్‌వర్క్‌కు ప్రాధాన్యం
- ఫ్యూచర్ సిటీకి హైస్పీడ్ కనెక్టివిటీ
- ఇంటింటికీ ఇంటర్నెట్ వేగవంతం
- గ్రామాలకు బ్రాడ్‌బ్యాండ్ విస్తరణ
- డిజిటల్ తెలంగాణే లక్ష్యం

**హైదరాబాద్,ఆగస్ట్4 :**
తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-ఫైబర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

## తెలంగాణలో వర్షాలు పడకుండా
# క్షుద్రపూజలు

- మాజీమంత్రి హరీష్ రావుపై పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ ఆరోపణలు



2 లో

**హైదరాబాద్,ఆగస్ట్4 :**
బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని కోరుకుంటూ ఆయన క్షుద్ర పూజలు చేశారని మహేశ్ గౌడ్ ఆరోపించారు. అందుకు తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అరుంధతి సినిమా తరహాలో ఆయన పూజలు నిర్వహిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చికి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు వెళ్లారని.. ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు.తిరుపతికి వెళ్లినప్పుడు మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. అఘోరీ ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని.. కానీ మాజీ మంత్రి మాత్రం ప్రజలకు కీడు జరగాలని పూజలు చేశారని విమర్శించారు.

# అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు

- ప్రత్యేక వైద్యసేవలు అందక ప్రజల ఇక్కట్లు
- కమిషనర్ లేక గాలిలో దీపంలా వైద్యవిధాన పరిషత్
- సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు



**హైదరాబాద్,ఆగస్ట్4 :**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన గైనకాలజీ, ఆర్థోపెడిక్, యూరాలజీ, పీడియాట్రిక్ తదితర ప్రత్యేక వైద్య సేవలను అందించే తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిస్థితి కమిషనర్ లేక గాలిలో దీపంలా మారడం శోచనీయమని తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హరీశ్‌రావు పోస్టుపెట్టారు. గత రెండు నెలలుగా పూర్తిస్థాయి

మిగతాద్ది 2 లో



# సిఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత ముఖ్యం

- బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,ఆగస్ట్4 :**
తెలంగాణలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) వ్యవస్థపై పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. సీఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత, సాంకేతిక సంస్కరణలపై చర్చించారు.

2 లో



# కాళేశ్వరం విలువ తెలిసి వస్తోంది: కెటిఆర్

**హైదరాబాద్,ఆగస్ట్4 :**
ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా గోదావరి జలాలు ఎదురెక్కడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు తన ప్రాముఖ్యతను మరోసారి నిరూపిస్తోందని అన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థుల
# ఆత్మస్థయిర్యం దెబ్బతీస్తారా

» సిఎం రేవంత్ వ్యాఖ్యలపై ఎంపి అర్వింద్ ఆగ్రహం

**న్యూఢిల్లీ,ఆగస్ట్4 :**
ఇంజనీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఖండించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య పట్ల చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం సరైనది కాదని అరవింద్ అన్నారు.



మిగతాది 2లో

## రూ.కోటి ఆశచూపి
# రూ.13 లక్షలు కాజేత

- మోసం కేసులో నిందితుడి అరెస్టు
- అశ్వారావుపేట ఠాణాలో వివరాలు వెల్లడిస్తున్న పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్



2లో..

# అభ్యంతరకర పోస్టులు పెడితే ఫిర్యాదు చేయడం తప్పా

- డిసిపి ఆనంద్‌బాబును ఎందుకు బదిలీ చేశారు
- రాహుల్‌పై విమర్శలు చేస్తే ఇలాగే వదిలేస్తారా
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్‌పై కిషన్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్,ఆగస్ట్4 :**
ప్రధానమంత్రి నరేంద్రమోదీపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేయడం రాజ్యాంగ హక్కు అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మెటాపై కేసు నమోదు చేసిన డీసీపీ ఆనంద్ బాబుని తెలంగాణ ప్రభుత్వం బదిలీ చేసిందని పేర్కొన్నారు. మంగళవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం పని చేసిన ఆ అధికారిని సీఎం రేవంత్‌రెడ్డి శిక్షించారని తెలిపారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రేవంత్‌రెడ్డి ఆ డీసీపీని ట్రాన్స్‌ఫర్ చేశారని ఆరోపించారు.

మిగతాద్ది 2 లో

## మత్స్యకారులకు
# ఇన్సూరెన్స్ సౌకర్యం

» సమీక్షలో మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడి



2లో..

**హైదరాబాద్,ఆగస్ట్4 :**
మత్స్యకారులకు ఇన్సూరెన్స్, మోపెడ్‌లు, రిటైల్ షాపుల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని మంత్రి వాకిటి శ్రీహరి నిర్ణయించారు. ప్రతి మూడు నెలలకు మత్స్యకార సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై సమావేశంలో చర్చించారు. పెండింగ్ బకాయిల విడుదలకు ప్రత్యేకంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. మత్స్యకారుల సంక్షేమంపై మంత్రి వాకిటి శ్రీహరి కీలక సమావేశం నిర్వహించారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో చర్చలు జరిపారు. 26 వేల చెరువులు, 100 రిజర్వాయర్లలో చేపల పెంపకంపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నారు. మధ్యాహ్న భోజనంలో చేపలను చేర్చే ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు.

## నగరంలో పెద్ద ఎత్తున
# కల్తీ మసాలాల తయారీ



2లో..

- 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం
- 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు
- కల్తీ మసాలాలలో క్యాన్సర్ వంటి ప్రమాదాలు
- కల్తీలపై సిట్ ద్వారా దర్యాప్తు చేపడతాం
- ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు
- నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి

**హైదరాబాద్,ఆగస్ట్4 :**
ఆహార కల్తీకి పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్న హెచ్ -ఫాస్ట్ అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించి పెద్ద ఎత్తున మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో పలు చోట్ల తనిఖీలు చేపట్టి 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించి.. 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 3 క్రిమినల్ కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, టాల్కమ్ పౌడర్లు, ఇండస్ట్రియల్ కలర్స్, రైస్ బ్రాన్ అయిల్ నకిలీ మసాలాల్లో వినియోగించినట్టు గుర్తించామన్నారు. కల్తీ మసాలాల వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు.



2లో..

## కాళోజీ వర్సిటీలో కన్వీనర్
# కోటా మెడికల్ సీట్లు

వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుకు నేడు అవకాశం

**వరంగల్,ఆగస్ట్4**
తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్, డెంటల్ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా (కన్వీనర్ కోటా) సీట్లలో ప్రవేశాల కోసం కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం ఆగస్ట్ 05, 2026

# అభ్యంతరకర పోస్టులు పెడితే ఫిర్యాదు చేయడం తప్పా

మొదటి పేజీ తరువాయి
చట్టప్రకారం నడిచే అధికారులపై సీఎం వేటు వేస్తున్నారని ధ్వజమెత్తారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఫోన్‌ట్యాపింగ్ చేసి అధికార దుర్వినియోగం చేసిందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం అదే తరహాలో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై సోషల్ మీడియా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ మద్దతుతో ఉన్న టీవీకే ప్రభుత్వంలో... సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేశారని తెలిపారు. మరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ కేసులు నమోదు చేసిన అధికారులను శిక్షిస్తోందని అన్నారు. రేపు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కూడా ఇలానే వదిలేస్తారా..? అని ప్రశ్నించారు. సింగరేణికి మూడు కోల్ బ్లాక్‌లు కేటాయించామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మణుగూరు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించామని ప్రకటించారు. వేలంలో పాల్గొనేందుకు అనేకమంది ముందుకొచ్చారు కానీ.. సింగరేణి కష్టాలను దృష్టిలో ఉంచుకునే కేటాయించినట్లు వివరించారు. నైనీ, తాడిచర్ల బ్లాక్-2, మణుగూరు బ్లాక్‌లను.. సింగరేణికి కేటాయించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. కొత్త బ్లాక్‌ల కేటాయింపుతో సింగరేణికి కొత్త ఆశలు వస్తాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సింగరేణిని దోచుకున్నాయని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

# ఇంజనీరింగ్ విద్యార్థుల ఆత్మస్థయిర్యం దెబ్బతీస్తారా

మొదటి పేజీ తరువాయి
విద్యాశాఖ బాధ్యతలను మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ సవాల్ విసిరారు. ఎవరి సహకారం లేకుండా రేవంత్ రెడ్డి నామినేషన్ పత్రాలు నింపగలరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కూడా లేవని అరవింద్ ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు లేని పరిస్థితి ఉందన్నారు. విద్యాశాఖ మంత్రిగా సీఎం ఒక్క ప్రభుత్వ పాఠశాలను అయినా సందర్శించారా అని ప్రశ్నించారు. ఉన్న పాఠశాలలను అభివృద్ధి చేయకుండా కొత్త పాఠశాలల నిర్మాణం పేరుతో ప్రభుత్వం కమిషన్ల కోసం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీ అరవింద్ డిమాండ్ చేశారు.

# కాళేశ్వరం విలువ తెలిసి వస్తోంది: కెటిఆర్

మొదటి పేజీ తరువాయి
రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాంసాగర్ వరద కాలువను పునరుజ్జీవింపజేస్తూ.. వరద కాలువలోని రాంపూర్, రాజేశ్వరరావుపేట పంప్‌హౌస్‌ల నుంచి నీటిని ఎత్తిపోసి సుమారు 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తూ తెలంగాణ రైతుకు కాళేశ్వరం ప్రాజెక్టు భరోసాను ఇస్తుందని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ఎన్ని అబద్దాలు ప్రచారం చేసినా, ఈ నీటిని తమ పొలాల్లో చూస్తున్న తెలంగాణ రైతన్నలకు నిజాలేమిటో తెలుసని వ్యాఖ్యానించారు.ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ఆరోపణలు తిప్పికొట్టారు. ఎస్సారెస్పీకి కాళేశ్వరం జలాలు ఎదురెక్కుతున్న వీడియోను షేర్ చేశారు.

### కాళోజీ వర్సిటీలో కన్వీనర్

# కోటా మెడికల్ సీట్లు

మొదటి పేజీ తరువాయి
క్వాలిఫై అయిన విద్యార్థులు ఆగస్టు 5 ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 12 సాయంత్రం 6 గంటల వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. సీట్ల మ్యాట్రిక్స్‌ను వెబ్ ఆప్షన్లకు ముందు ప్రత్యేకంగా ప్రకటిస్తామని పేర్కొంది. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే ముందు ప్రాస్పెక్టస్‌ను పూర్తిగా చదివి, అర్హతలు, రిజర్వేషన్లు, అవసరమైన ధ్రువపత్రాలు, నిబంధనలను పరిశీలించి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని విశ్వవిద్యాలయం సూచించింది. పూర్తి వివరాలు, సమాచారం కోసం వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరింది. ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు అన్ని సర్టిఫికెట్లను తప్పకుండా అప్‌లోడ్ చేయాలి. నమోదు పక్రియ ఒక్కసారి మాత్రమే ఉంటుంది. ప్రతి రౌండ్ కౌన్సెలింగ్‌కు మళ్లీ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల చేస్తారు. అనంతరం వెబ్ ఆప్షన్లు, కౌన్సెలింగ్ షెడ్యూల్, సీట్ల మ్యాట్రిక్స్‌ను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చేటప్పుడు కళాశాలల ప్రాధాన్యత క్రమాన్ని జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలని విశ్వవిద్యాలయం సూచించింది.

# నగరంలో పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ

మొదటి పేజీ తరువాయి
కల్తీ ఆహార పదార్థాల కేసులపై త్వరలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేస్తామని సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ కల్తీ మసాలా తయారీముఠా కేసులో హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రకటించారు. ప్రమాదకర రసాయనాలతో టన్నుల మసాలా దినుసులను తెలుగు రాష్ట్రాలకు ఈ ముఠా సరఫరా చేస్తోందని తెలిపారు. సిట్ ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై హెచ్ -ఫాస్ట్ మెరుపు దాడులు చేసిందని సీపీ పేర్కొన్నారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ప్రజల సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పుకొచ్చారు. 25 టన్నులకుపైగా కల్తీ మసాలాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కల్తీ మసాలాల కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశామని అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు సహా పలు మసాలాల్లో కల్తీ చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్‌తో మసాలాలు తయారీ చేస్తున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మసాలాలకు మెరుపు కోసం హానికర రసాయనాలను వినియోగిస్తున్నారని తెలిపారు. రంగులు వేసి నాణ్యమైన మసాలాల మాదిరిగా విక్రయిస్తున్నారని చెప్పుకొచ్చారు. 89 టన్నులకుపైగా ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ మసాలాల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపామని వెల్లడించారు. కల్తీ ఆహారం వల్ల కాలేయం, మూత్రపిండాలకు ముప్పు పొంచి ఉందని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మసాలాలతో క్యాన్సర్, అలర్జీలు, జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఊ- ఈం÷ ఏర్పడిన 140 రోజుల్లో 659 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని అన్నారు. 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 246 టన్నుల కల్తీ ఆహారాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రజలు అనుమానాస్పద ఆహారంపై వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# తెలంగాణలో వర్షాలు పడకుండా క్షుద్రపూజలు

మొదటి పేజీ తరువాయి
తన రాజకీయ స్వార్థం కోసమే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై నిజాలు బయటపెట్టినందుకే అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపించారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అయితే లీగల్ నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అఘోరాలతో క్షుద్ర పూజలు చేశారనే ప్రచారం గతంలో జరిగిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చెప్పారు. ఇప్పుడు హరీశ్ రావుపై వస్తున్న ఆరోపణలతో కేసీఆర్ పూజలు కూడా నిజమేనని అనిపిస్తోందన్నారు. యాదగిరిగుట్టకు వెళ్లి పొర్లు దండాలు పెట్టి మరీ ఏం చేశారో ప్రజలకు హరీశ్ రావు చెప్పాలని ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. గతంలో మంత్రాలు, తంత్రాల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన ఘటనలు ఉన్నాయని, దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇలాంటి ఆచారాలను బలంగా నమ్ముతారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

# అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు

మొదటి పేజీ తరువాయి
అధికారి లేకపోవడంతో ÷ఎఖ పరిధిలోని ఎంసీహెచ్, జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్సీ మొత్తంగా 184 ఆస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత తదితర అంశాలను పర్యవేక్షించే అధికార యంత్రాంగమే లేకుండా పోయిందని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. దీంతో ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ పాలనలో ప్రజలు సరైన వైద్య సేవలు అందక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది వేతనాలు, సర్వీస్ సమస్యలు సహా ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ÷ఎఖని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని తమ హయాంలో నిర్ణయించామని ప్రస్తావించారు. దాదాపు మూడేళ్లు గడుస్తున్నా సర్వీసు నిబంధనలు రూపొందించక పోవడం, లక్ష్యం కార్యరూపం దాల్చకపోవడం దురదృష్టకరమని హరీశ్‌రావు అన్నారు. దీంతో వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారని చెప్పుకొచ్చారు. ఇదే విషయమై ఉద్యోగులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండా పోతుందని తెలిపారు. రో÷-లడెక్కి నిరసనలు తెలియచేస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. వెంటనే డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి వెంటనే కమిటీ వేసి సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని, తక్షణమే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

### మత్స్యకారులకు

# ఇన్సూరెన్స్ సౌకర్యం

మొదటి పేజీ తరువాయి
సభ్యత్వ వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్ నిర్మాణం కొనసాగుతోందన్నారు. ఆన్‌లైన్‌లో చేపల విక్రయాలకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దోహదం చేస్తుందని చెప్పుకొచ్చారు. రూ. 1.34 కోట్ల ఇన్సూరెన్స్ ÷-లకెయిమ్‌లను ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షుల ప్రోటోకాల్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

# సిఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత ముఖ్యం

మొదటి పేజీ తరువాయి
గత 10-12 ఏళ్లుగా సీఎంఆర్‌లో జరిగిన వ్యవహారాలపై లోతుగా పరిశీలన చేపట్టారు. ప్రభుత్వానికి సీఎంఆర్ బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. బకాయిల వసూళ్లపై ప్రత్యేకంగా దృష్టిసారించారు.

ఇప్పటివరకు నిర్వహించిన విజిలెన్స్ దాడులు, నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతిపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. జిల్లాల వారీగా రైస్ మిల్లర్ల పనితీరు, సీఎంఆర్ బకాయిల పరిస్థితి, డిఫాల్టర్ల వివరాలపై అధికారులు నివేదికలు సమర్పించారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణకు కొత్త వ్యూహాలను రూపొందించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్, లీగల్ విభాగాల ఉన్నతాధికారులకు సమావేశానికి హాజరుకావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం, ప్రభుత్వ నిధుల రక్షణెళి ఈ సమావేశం ప్రధాన లక్ష్యమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# రూ.కోటి ఆశచూపి రూ.13 లక్షలు కాజేత

మొదటి పేజీ తరువాయి
అశ్వారావుపేట గ్రామీణం: రూ.కోటి వస్తుందని నమ్మి రూ. 13 లక్షలు పోగొట్టుకున్న సంఘటనలో నిందితుణ్ని అరెస్టు చేసినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. అశ్వారావుపేట ఠాణాలో మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం మేరకు.. ఏపీలోని ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలుకు చెందిన పత్తిపాటి ప్రేమ్‌చంద్ కొన్నాళ్ల కిందట అశ్వారావుపేట వచ్చి ఫైర్ కాలనీలో నివాసముంటున్నాడు. జల్సాలకు అలవాటు పడి మోసపూరితంగా సంపాదించే మార్గాలను ఎంచుకున్నాడు. అశ్వారావుపేటకు చెందిన వ్యాపారి మధుబాబును గత ఏడాది డిసెంబరులో కలిసి తనకు రూ. 15 లక్షలు ఇస్తే రూ.కోటి ఇస్తానని మాయమాటలు చెప్పాడు.

నోట్లను కళ్లెదుటే తయారు చేస్తానని నమ్మించి రసాయనాలు కలిపిన నీళ్లలో నల్లని కాగితాలను ముంచి (అప్పటికే చేతి వేళ్ల మధ్య అసలు నగదు నోట్లు దాచి ఉంచి) అసలు రూ. 500 నోట్లుగా మారినట్లు నమ్మించాడు. కొద్దిరోజుల్లోనే నల్లని కాగితాలను నోట్లుగా తయారు చేసి రూ.కోటి ఇస్తానని చెప్పాడు. దీనికి రూ. 15 లక్షలు ఇవ్వాల్సి ఉంటుందన్నాడు. ఇది నమ్మిన మధుబాబు నిందితుడికి తొలి విడతగా రూ. 11 లక్షలు ఇచ్చాడు. ఆ తర్వాత రసాయనాలు కొనుగోలు చేయాలని చెప్పడంతో మరో రూ. 2 లక్షలు ఇచ్చాడు. నెలలు గడుస్తున్నా ఇస్తానన్న రూ.కోటి ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు ఆలస్యంగా తెలుసుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఫైర్ కాలనీలో నిందితుడు ప్రేమ్‌చంద్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడి నుంచి రూ. 500 నోట్ల పరిమాణంలో కత్తిరించిన 20,000 నల్లటి కాగితాలు 20 కట్టలు, రెండు రసాయనాల సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

# 20 పెట్రోల్ వినియోగంపై ముందుకే

## రాజ్యసభలో కేంద్రమంత్రి స్పష్టీకరణ

దేశంలో పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని ఉపయోగించే ఇ20 పెట్రోల్ పాలసీ అమలుపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా కీలక స్పష్టత ఇచ్చింది. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ అడిగిన ప్రశ్నకు పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఇ20 ఇంధన వినియోగం, పాత వాహనాల భద్రత, దీని వల్ల చేకూరే ప్రయోజనాలను కేంద్రం సమగ్రంగా వివరించింది. దేశవ్యాప్తంగా ఇ20 పెట్రోల్ వినియోగాన్ని దశలవారీగా వేగవంతం చేస్తున్నామని, ఈ పాలసీ ద్వారా ప్రధానంగా మూడు ప్రయోజనాలు ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ముడి చమురు దిగుమతులపై భారత్ ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు, పెద్ద ఎత్తున విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడం దీని ప్రధాన లక్ష్యమని చెప్పింది. చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు అదనపు మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా రైతులకు మెరుగైన మద్దతు ధర, అదనపు ఆదాయం అందుతుందని వెల్లడించింది. ఇంధనంలో ఇథనాల్ కలపడం వల్ల కార్బన్ ఉద్గారాలు గణనీయంగా తగ్గి, పర్యావరణానికి మేలు జరుగుతుందని పేర్కొంది.

# సిఎం విజయ్ ఓ అసమర్థ నాయకుడు కావేరీ జలాలపై దృష్టి మరల్చేందుకే ఉదయనిధి అరెస్ట్

**- ఎక్స్ వేదికగా మండిపడ్డ మాజీ సిఎం స్టాలిన్**

నటి త్రిషను ఉద్దేశిస్తూ డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు తమిళనాట రాజకీయ దుమారం రేపాయి. ఇందుకు సంబంధించిన కేసులో ఆయన అరెస్టయి.. బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ పరిణామాలపై ఉదయనిధి తండ్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ స్పందిస్తూ.. సీఎం విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అహంకారం వినాశనానికి దారితీస్తుందని, అది నిరంతరం కొనసాగితే.. మరింత వేగంగా పతనమవుతారని దుయ్యబట్టారు. విజయ్.. ఓ అసమర్థ నాయకుడని మండిపడ్డారు. ఈ మేరకు మాజీ సీఎం తన ఎక్స్ ఖాతాలో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

'కావేరీ నదీ జలాలు, మేకెదాటు ప్రాజెక్ట్ వ్యవహారంలో తమిళనాడు హక్కులను అణచివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. దాన్ని ఖండించేందుకు తంజావూరులో డీఎంకే ఆందోళన కార్యక్రమం చేపట్టింది. అందులో ఉదయనిధి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ విమర్శలకు బదులుచెప్పే ధైర్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని లేదు. అందుకే వాటిపై దృష్టి మరల్చేందుకు ఉదయనిధిని అరెస్ట్ చేసింది. మన సీఎం విజయ్ కావేరీ నీటిని తీసుకురాలేరు. ఆయనో డమ్మీ సీఎం. ఇక, ఆయన మంత్రులు ఒక సినిమా (జననాయగన్‌ను ఉద్దేశిస్తూ)ను పట్టుకుని వేలాడుతున్నారు. రాష్ట్రంలో ఓ జోకర్ క్యాబినెట్ అధికారంలో ఉందని స్టాలిన్ విమర్శించారు. శాసనసభలో ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న ఉదయనిధి పట్ల పోలీసులు దారుణంగా వ్యవహరించారు. ఇంటికొచ్చి అరెస్టు చేసి.. తంజావూరుకు తీసుకెళ్లారు. కోర్టు విచారణ సందర్భంగా ఉదయనిధిని కస్టడీలోకి తీసుకొనే ఉద్దేశం లేదని ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలిపారు. మరి అలాంటప్పుడు ఆయనను తంజావూరుకు ఎందుకు తరలించారు? ఎందుకు అన్ని కేసులు పెట్టారు. కోర్టు ఆదేశాలు ప్రభుత్వానికి చెంపపెట్టని మాజీ సీఎం ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. తనను విమర్శిస్తున్న వారందరినీ విజయ్ అరెస్టు చేయిస్తున్నారని స్టాలిన్ దుయ్యబట్టారు. చెన్నైలోని మెరీనా బీచ్ వద్దకు ఆందోళనకారులను రానివ్వడం లేదని, నీట్ వ్యతిరేక ర్యాలీని కూడా అనుమతించట్లేదని ఆరోపించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముందు ఉదయనిధి అరెస్టు కుట్రపూరిత చర్యేనని స్టాలిన్ మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలకు తమ నేతను దూరంగా ఉంచాలనే ఉద్దేశంతోనే ఉదయనిధిపై తప్పుడు కేసులు పెట్టించారని విమర్శించారు. తన కుమారుడు ఎవరిపైనా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయలేదని, ఒకవేళ అలా చేసినట్లు నిరూపిస్తే తక్షణమే క్షమాపణలు చెబుతాడని స్టాలిన్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. సీఎం విజయ్ ఇకనైనా రీల్స్ క్రియేట్ చేయడం మాని.. తన బాధ్యతలను గుర్తించి దానికి అనుగుణంగా వ్యవహరించాలన్నారు.

# తమిళనాట రాజకీయ రచ్చ..త్రిషపై పరోక్ష విమర్శలు

## ఉదయనిధి అరెస్ట్..కోర్టు ఆదేశాలతో విడుదల

తమిళనాడులో సీఎం విజయ్, సినీ నటి త్రిషపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో అరెస్టయిన ఉదయనిధి స్టాలిన్‌ను పోలీసులు విడుదల చేశారు. పోలీసులు ఉదయనిధి స్టాలిన్‌ను సెంగిపట్టి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి సుమారు గంటన్నరపాటు విచారించిన నంతరం విడుదల చేశారు.కావేరి జలాల అంశంపై జరిగిన సభలో ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు నటి త్రిషను ఉద్దేశించినవిగా విమర్శలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఆయనను చెన్నైలోని నివాసం నుంచి అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యను సవాల్ చేస్తూ డీఎంకే మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా, విచారణ అనంతరం ఉదయనిధిని విడుదల చేయాలని, తదుపరి విచారణ వరకు బలవంతపు చర్యలు తీసుకోవద్దని కోర్టు ఆదేశించింది. కావేరీ జలాల అంశం ప్రస్తుతం తమిళనాడులో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ క్రమంలో తంజావూరులో జరిగిన నిరసన ప్రదర్శనలో నటి త్రిషను ఉద్దేశించి డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఉదయనిధిని అరెస్ట్ చేశారు. విచారణ నిమిత్తం ఆయనను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కావేరీ నదీ జలాల అంశంపై సోమవారం జరిగిన నిరసన ప్రదర్శనలో ఉదయనిధి మాట్లాడుతూ.. విజయ్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. డెల్టా రైతుల ప్రయోజనాలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆయన ప్రసంగిస్తోన్న సమయంలో పలువురు కార్యకర్తలు త్రిష, త్రిష అంటూ నినాదాలు చేశారు. ఆ నినాదాల మధ్యనే తన ప్రసంగాన్ని కొనసాగించిన ఉదయనిధి పరోక్షంగా నటి ప్రస్తావన తెచ్చారు. ఆమె గురించి ద్వంద్వార్థం ధ్వనించేలా అనుచితంగా మాట్లాడారు. అయితే తాను చెప్పింది కావేరీ గురించేనని ఆయన వివరణ ఇచ్చారు. దీంతో ఉదయనిధి వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ఇవి అసహ్యమైన వ్యాఖ్యలు. ఎవరిపైనా ఇలాంటి అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదు. డీఎంకే దిగజారుతున్న రాజకీయ ప్రమాణాలకు ఈ మాటలు నిదర్శనం' అని టీవీకే నేతలు మండిపడ్డారు. భాజపా నేతలు కూడా ఈ వ్యాఖ్యలను ఖండించారు. ఇది సిగ్గుచేటు ప్రవర్తన అని తప్పుపట్టారు. ఉదయనిధి తీరుపై టీవీకే పార్టీ.. జాతీయ మహిళా కమిషన్‌ను ఫిర్యాదు చేసింది. ఆయన వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకొని, చర్యలు చేపట్టాలని కోరింది. అలాగే ఉదయనిధి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది.

# తెలుగుభాషకు మండలి కృషిప్రశంసనీయం మ్మీ డాడీ భాషలను వదిలేస్తేనే మంచిది

దేశానికి, తెలుగు భాషకు మండలి వెంకటకృష్ణారావు చేసిన సేవలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంసించారు. నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మండలి వెంకట కృష్ణారావు శతజయంతి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలి వెంకట కృష్ణారావు కాంస్య విగ్రహాన్ని ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మండలి వెంకట కృష్ణారావు స్మృతికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. ఏది ప్రారంభించాలన్నా రిబ్బన్ కత్తిరించడం సరికాదన్నారు. అది బ్రిటీష్ వారు నేర్పిన విధానమని చెప్పారు. మన దేశాన్ని, మనల్ని వారు విభజించి వెళ్లారని అన్నారు. ఏదైనా ముడి వేస్తే దానిని విప్పి ప్రారంభోత్సవ సూచికగా చూడాలన్నారు. మండలి వెంకట కృష్ణారావు వంటి మహనీయుల సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని అమలు చేయాలన్నారు. దివిసీమ ఉప్పెన సమయంలో ఆయన చేసిన సేవలు అద్భుతమని కొనియాడారు. గాంధేయవాదిగా ఆయన పనితీరును చూసే అదృష్టం తనకు దక్కిందన్నారు. ఏ శాఖ మంత్రిగా ఉన్నా ప్రతి పనిలో తనదైన ముద్ర వేశారని చెప్పారు. తెలుగు భాష పరిరక్షణకు మండలి బుద్ధప్రసాద్ కృషి చేస్తూ తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్నారని అన్నారు. మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. వెంకట కృష్ణారావు జీవిత విశేషాలతో మల్లిఖార్జునరావు రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించామని వెంకయ్య నాయుడు చెప్పారు. మహనీయుల జీవితాల్లో జరిగిన ముఖ్య ఘట్టాలను ఇటువంటి పుస్తకాల ద్వారానే నేటి తరం తెలుసుకోవాలని అన్నారు. వెంకట కృష్ణారావు నిగర్వి, నిరాడంబరుడిగా ఉంటూనే సేవలందించారని కొనియాడారు. తెలుగు భాష పరిరక్షణ కోసం ఆయన ఎంతో పరితపిస్తూ కృషి చేసేవారని తెలిపారు. వెంకట కృష్ణారావు స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొని గురువులను గౌరవించేవారని గుర్తు చేశారు. ఆ రోజుల్లో ఆచార్య రంగాని అవనిగడ్డకు ఆహ్వానించి కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. ఈ రాష్ట్రంలో రాజకీయ కార్యకర్తలకు పాఠశాలలు ఏర్పాటు చేసి ఆచార్య రంగా శిక్షణ ఇచ్చేవారని తెలిపారు. పాత రోజుల్లో కమ్యూనిస్టులు, జనసంఘ్ కూడా ఇలాగే శిక్షణ ఇచ్చేవారని అన్నారు. నేటి రోజుల్లో రాజకీయ నేతలకు తప్పనిసరిగా శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మమ్మీ, డాడీ' సంస్కృతి వదిలేసి 'అమ్మ, నాన్న' అని పిలిపించుకోవాలని మాజీ ఉప రాష్ట్రపతి సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులన్నీ తెలుగులోనే ఇవ్వాలని, అది కచ్చితంగా అమలు చేయాలని అన్నారు. అవసరమైన వారికి ఇంగ్లిష్‌లో అదనంగా కాపీలు ఇవ్వాలని సూచించారు.

## విమాన ప్రయాణీకుల భద్రతపై కేంద్ర చర్యలపై రాజ్యసభలో ఎంపీ రవిచంద్ర ప్రశ్న

- ప్రయాణీకుల భద్రత, క్రమశిక్షణ కోసం ప్రత్యేక మార్గదర్శకాలు అమల్లో ఉన్నాయని కేంద్రం వెల్లడి
- ఫిర్యాదుల పరిష్కారానికి 24 గంటల సహాయ కేంద్రం, 'ఎయిర్ సేవ' వేదిక అందుబాటులో ఉందని మంత్రి సమాధానం



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 4**
విమాన ప్రయాణీకుల భద్రత, క్రమశిక్షణ, ప్రయాణీకులతో విమాన సిబ్బంది మర్యాద పూర్వకంగా వ్యవహరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభలో ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ, విమానాలు, ప్రయాణీకులు, వారి ఆస్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక విభాగాలతో పాటు స్పష్టమైన మార్గదర్శకాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. విమానాల్లో క్రమశిక్షణను కాపాడేందుకు, ప్రయాణీకుల పట్ల సిబ్బంది మర్యాదగా వ్యవహరించేలా, అలాగే అల్లరి లేదా అవాంఛనీయ ప్రవర్తనను నియంత్రించేందుకు పౌర విమానయాన ప్రధాన నియంత్రణ సంస్థ రూపొందించిన ప్రత్యేక నిబంధనలు అమలులో ఉన్నాయని మంత్రి వివరించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న ప్రయాణీకులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన సేవలు అందించేలా ప్రత్యేక భద్రతా మార్గదర్శకాలను కూడా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణీకుల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు 24 గంటల పాటు పనిచేసే ప్రయాణీకుల సహాయ నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. విమానాల రాకపోకల సమయాలు, సామాన్ల భద్రత, సామాన్ల చేరవేతలో తలెత్తే సమస్యలు, చెల్లింపుల తిరిగి చెల్లింపు వంటి అంశాలను సంబంధిత సంస్థలతో సమన్వయం చేస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. అదనంగా, ప్రయాణీకుల ఫిర్యాదులను వేగంగా స్వీకరించి పరిష్కరించేందుకు 'ఎయిర్ సేవ' పేరుతో ప్రత్యేక అంతర్జాల వేదికతో పాటు మొబైల్ అనువర్తనాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మంత్రి మురళీధర్ మొహోల్ తన సమాధానంలో పేర్కొన్నారు.

## ట్రాఫిక్ సిగ్నల్‌ను గౌరవిద్దాం.. ప్రాణాలను కాపాడుకుందాం

- హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగంతోనే ప్రమాదాల నివారణ సాధ్యం
- 'అంతర్జాతీయ ట్రాఫిక్ లైట్ దినోత్సవం" సందర్భంగా డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి పిలుపు




**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, ఆగస్టు 4**
రహదారిపై ప్రతి ఒక్కరి అప్రమత్తతే ప్రమాద రహిత సమాజానికి పునాది అని, ట్రాఫిక్ సిగ్నళ్లను గౌరవించడం ద్వారా అనేక విలువైన ప్రాణాలను కాపాడవచ్చని ప్రముఖ సామాజికవేత్త, విద్యావేత్త, శ్రీనివాస రామానుజన్ ఒలంపియాడ్ స్కూల్ అధినేత ముచ్చ రాజిరెడ్డి అన్నారు. ఆగస్టు 5న నిర్వహించే 'అంతర్జాతీయ ట్రాఫిక్ లైట్ దినోత్సవం" సందర్భంగా డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలో తొలి విద్యుత్ ట్రాఫిక్ లైట్ వ్యవస్థను 1914 ఆగస్టు 5న అమెరికాలో ప్రారంభించిన సందర్భంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో రహదారి భద్రతకు ట్రాఫిక్ సిగ్నళ్లు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యత కూడా అని ఆయన అన్నారు. సిగ్నళ్లను ఉల్లంఘించడం, అతివేగంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి నిర్లక్ష్య చర్యలే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటు బెల్ట్ వినియోగించాలని, పాదచారులు జీబ్రా క్రాసింగ్‌ల ద్వారానే రహదారిని దాటాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతలో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించేందుకు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, తల్లిదండ్రులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను స్వచ్ఛందంగా పాటించే అలవాటు పెంపొందించుకున్నప్పుడే ప్రమాదాల సంఖ్య తగ్గి, సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. "ట్రాఫిక్ సిగ్నల్‌ను గౌరవిద్దాం... ప్రాణాలను కాపాడుకుందాం" అనే సందేశాన్ని ప్రతి పౌరుడు జీవితంలో ఆచరణలో పెట్టాలని డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి పిలుపునిచ్చారు.

## పార్లమెంట్‌లోనే బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలి

- బీసీలను నిర్లక్ష్యం చేస్తే రాజకీయ మూల్యం తప్పదని హెచ్చరిక
- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 4**
ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనాభాలో సగానికి పైగా ఉన్న వెనుకబడిన తరగతులకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు మహిళా రిజర్వేషన్లలో బీసీలకు ప్రత్యేక కోటా కల్పించాలని ఆయన కోరారు.
ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. 70 కోట్లకు పైగా జనాభా ఉన్న బీసీల సమస్యలపై పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీలు చర్చించకపోవడం విచారకరమని విమర్శించారు.
సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా రంగాల్లో తరతరాలుగా వెనుకబడిన బీసీలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆయన పేర్కొన్నారు. బీసీలను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వాలు తగిన రాజకీయ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.
తాను వెనుకబడిన తరగతికి చెందినవాడినని పలుమార్లు ప్రకటించుకున్న ప్రధానమంత్రి బీసీ రిజర్వేషన్ల అంశంపై మౌనం పాటించడం వెనుక కారణం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ శాసనసభలో విద్య, ఉద్యోగాలు,



స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆమోదించిన బిల్లును కేంద్రానికి పంపి చాలా కాలం గడిచినా ఇప్పటికీ నిర్ణయం తీసుకోకపోవడం కేంద్ర ప్రభుత్వ వైఖరిని వెల్లడిస్తోందని అన్నారు.
ఆర్థికంగా బలహీన వర్గాల కోసం 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన కేంద్ర ప్రభుత్వం, బీసీల న్యాయమైన డిమాండ్లను మాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని వెంకట్రాములు విమర్శించారు.
రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, భారతీయ జనతా పార్టీ నాయకులు పార్టీ ప్రయోజనాల కంటే బీసీ సమాజ హక్కులకు ప్రాధాన్యం ఇచ్చి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు. బీసీ డిమాండ్ల సాధన కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ ఏకమై ఉద్యమాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు.
బీసీ ఉద్యమాలు ఉధృతం కాకముందే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ అంశంపై చర్చించి బిల్లును ఆమోదించాలని, లేనిపక్షంలో ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి ఉంటుందని వెంకట్రాములు హెచ్చరించారు.

## వరంగల్ అభివృద్ధిపై కేంద్రాన్ని నిలదీసిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య

- రైల్వేలు, జాతీయ రహదారులు, టెక్స్‌టైల్ పార్క్ ప్రాజెక్టులపై కేంద్రం వివరాల వెల్లడి
- ప్రాజెక్టులు పూర్తయితే పారిశ్రామిక వృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఎంపీ ఆశాభావం



**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ, ఆగస్టు 4**
వరంగల్ జిల్లా సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, పారిశ్రామిక ప్రగతికి సంబంధించి కేంద్ర ప్రభుత్వాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. ప్రధాన మంత్రి గతిశక్తి, ఆస్పిరేషనల్ బ్లాక్స్ కార్యక్రమం, ఇతర కేంద్ర పథకాల కింద వరంగల్ జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలు రూపొందించారా? రూపొందించి ఉంటే ఏయే ప్రాజెక్టులకు ఆమోదం లభించింది? వాటి ద్వారా జిల్లాకు కలిగే ప్రయోజనాలు ఏమిటో వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రశ్నకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. వరంగల్ జిల్లాలో రవాణా అనుసంధానాన్ని బలోపేతం చేసేందుకు సుమారు రూ.7,843 కోట్ల వ్యయంతో 447 కిలోమీటర్ల మేర మూడు రైల్వే ప్రాజెక్టులు, అలాగే రూ.6,133 కోట్ల వ్యయంతో 185 కిలోమీటర్ల మేర నాలుగు జాతీయ రహదారి ప్రాజెక్టులకు ఆమోదం లభించినట్లు వెల్లడించింది. అదేవిధంగా, ప్రధాన మంత్రి మిత్ర పథకం కింద 1,327 ఎకరాల విస్తీర్ణంలో బ్రౌన్‌ఫీల్డ్ వస్త్ర పార్కు ఏర్పాటు కోసం సుమారు రూ.1,696 కోట్ల వ్యయాన్ని కేటాయించినట్లు కేంద్రం తెలిపింది. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ అభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రణాళికలు, నిధుల కేటాయింపులు, అమలులో ఉన్న ప్రాజెక్టులపై స్పష్టత తీసుకురావడమే తన ప్రశ్న ఉద్దేశమని తెలిపారు. రైల్వేలు, జాతీయ రహదారులు, వస్త్ర పార్కు వంటి కీలక ప్రాజెక్టులు సకాలంలో పూర్తయితే వరంగల్ జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి వేగవంతమై, యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. వరంగల్‌కు మంజూరైన అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేలా కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకువస్తానని ఎంపీ స్పష్టం చేశారు. కేంద్రం ప్రకటించిన ప్రాజెక్టులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, నిర్ణీత గడువులో అమలు జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని ఎంపీ పేర్కొన్నారు.

## వరంగల్ పశ్చిమ వైద్య రంగానికి మరింత ఊతం

- వైద్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహను కలిసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కాజీపేట 30 పడకల ఆసుపత్రి, ప్రసూతి ఆసుపత్రి, క్షయవ్యాధి ఆసుపత్రి అభివృద్ధికి వినతి



**కరపత్రం ప్రతినిధి /హైదరాబాద్, ఆగస్టు 4**
వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్య సంస్థల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి దామోదర్ రాజనరసింహను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, యశస్విని రెడ్డి పాల్గొన్నారు.సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్య సదుపాయాల విస్తరణ, ఆధునికీకరణకు సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాజీపేటలో నూతనంగా 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి, అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలుకు అదనపు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా క్షయవ్యాధి ఆసుపత్రికి నూతన భవనం నిర్మించడంతో పాటు కొత్త అంబులెన్స్, అత్యాధునిక ఎక్స్‌రే యంత్రాన్ని మంజూరు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలపై మంత్రి దామోదర్ రాజనరసింహ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. అన్ని అంశాలను పరిశీలించి, అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.
వరంగల్ పశ్చిమలో వైద్య మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతిపాదిత పనులు అమలైతే నియోజకవర్గ ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

- పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లోని పేరా–3ను సవరించాలని డిమాండ్
- రెండో రోజుకు చేరిన దళిత క్రైస్తవ శాంతియుత మహాదీక్షలు



**కరపత్రం ప్రతినిధి వరంగల్, ఆగస్టు 4**
దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తూ ఎస్సీ ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లోని పేరా–3ను ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే సవరించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వరంగల్ జిల్లా చైర్మన్ సిలువేరు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా కేంద్రంలో డీసీఐవీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్ల కుమార్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దళిత క్రైస్తవ శాంతియుత మహాదీక్షలు మంగళవారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను ప్రారంభించిన సిలువేరు శ్రీనివాస్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మతం మారిన కారణంగా దళిత క్రైస్తవులకు రాజ్యాంగబద్ధ హక్కులు నిరాకరించడం సామాజిక న్యాయానికి విరుద్ధమని పేర్కొన్నారు. వరంగల్ క్రిస్టియన్ సొసైటీ చైర్మన్ సరిగొమ్ముల దిన్ దయాళ్ దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. దళిత క్రైస్తవుల హక్కులను కాలరాయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు. ఎస్సీ ప్రెసిడెన్షియల్ ఆర్డర్ అమలులోకి వచ్చిన ఆగస్టు 10ను బ్లాక్ డేగా పాటిస్తూ, హనుమకొండ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం నుంచి వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించనున్న శాంతియుత నిరసన ర్యాలీలో చర్చిల పాస్టర్లు, బిషప్‌లు, చర్చి నాయకులు, దళిత క్రైస్తవ కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షలకు కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు దుపాకి సంతోష్, దొమ్మటి ప్రవీణ్, సింగారం ప్రేమ్, దాసరపు సారన్న, పోలిపాక సుమన్, ఇమ్మడి బాబు, న్యాయవాది జె. ఆనంద్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. దీక్ష సందర్భంగా పాస్టర్ ఇసంపెల్లి అబ్రహాం ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సందేల లాజర్, ఎం.కే. బాబు, జన్ను యేసేప్ రాజ్, జన్ను ప్రశాంత్, సిలువేరు నగేష్, ఎర్రోళ్ల బాబు, నాగారపు స్వామి, ఈర్ల హరినాథ్, జన్ను దయాకర్, దౌడు విజయ్ రాజు, గిన్నరపు దయాకర్, కొండ్ర రాజు మాదిగ, డాక్టర్ గనిపాక క్రాంతి, జూపాక సురేష్, స్వామి తదితర నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 4**
తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయని ఐపిఎం డైరెక్టర్ డాక్టర్ సి.శివలీల అన్నారు. మంగళవారం నారాయణగూడ లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపిఎం) ప్రాంగణంలోని దుర్గాదేవి ఆలయంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని బోనాల వేడుకలను ప్రారంభించి ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్,





ఏలూరు శ్రీనివాస్ రావు, ముజీబ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎం. సత్యనారాయణగౌడ్, రాసూరి జ్ఞానేశ్వర్, బంగ్లా సుశీల్, ఎం.శ్రీనివాస్ రావు, నవీన్ కుమార్, శ్రీకాంత్, మహేష్, ప్రదీప్, సంతోష్, నరేష్, ప్రశాంత్, డి.ప్రభాకర్, కన్నె రమేష్ యాదవ్, బల్వీర్, డాక్టర్ విజయశాంతి, డాక్టర్ ఉమా, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ సాయితేజ, జగన్మోహన్ మోహన్ రావు, డాక్టర్ రమా, శైలజ, ముకరాల చంద్రశేఖర్ గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, డాక్టర్ అయోషా, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ సబిత, డాక్టర్ దివ్యకీర్తి, డాక్టర్ కలీల్, తదితరులు పాల్గొన్నారు.

## కాట్రపల్లిలో ఘనంగా గ్రామసభ - పాఠశాలలో బాలసభ నిర్వహణ

- గ్రామాభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, పాఠశాల మౌలిక వసతులపై కీలక తీర్మానాలు



**కరపత్రం ప్రతినిధి హుజూరాబాద్, ఆగస్టు 4**
హుజూరాబాద్ మండలంలోని కాట్రపల్లి గ్రామంలో మంగళవారం గ్రామసభతో పాటు ఉన్నత ప్రాథమిక పాఠశాలలో బాలసభను ఉత్సాహభరితంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్, సర్పంచ్ పెరుమాండ్ల హైమా–బిక్షపతి, ఉపసర్పంచ్ గంగదారి బిక్షపతి కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన గ్రామసభలో పలు కీలక అంశాలపై చర్చించారు. గ్రామంలోని మహిళా సంఘం భవన నిర్మాణంతో పాటు అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. పంచాయతీ పరిధిలో గతంలో జరిగిన ఆర్థిక లావాదేవీల వివరాలను సభలో ప్రజల ముందుంచి సమీక్షించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపర్చాలని గ్రామస్తులు సూచించారు. దోమలు, ఈగల నివారణకు క్రమం తప్పకుండా బ్లీచింగ్ చల్లడం, పొగమందు పిచికారీ చేపట్టాలని కోరారు. ప్రతి ఇంటికి నిరంతరాయంగా రక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సభలో కోరారు. అనంతరం గ్రామంలోని ఉన్నత ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బాలసభలో విద్యార్థుల అవసరాలు, పాఠశాల మౌలిక వసతులపై చర్చించారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, నిరంతర నీటి సరఫరా, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజన వంటశాల ఏర్పాటు, విద్యార్థుల శారీరక–మానసిక వికాసానికి అవసరమైన ఆటపరికరాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ కార్యక్రమాల్లో వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, పాఠశాల పురోగతికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు.

## ఘనంగా పోచమ్మ తల్లికి బోనాలు



కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల
చందుర్తి మండలం లింగంపేట గ్రామంలోని మహోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం పోచమ్మ బోనాల వేడుకలను కరస్పాండెంట్ ఏనుగుల కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోతరాజుల వేషధారణతో పాటు అమ్మవారి వేషధారణలో ఆకట్టుకునే విన్యాసాలు ప్రదర్శించారు. అనంతరం పాఠశాల నుంచి పోచమ్మ దేవాలయం వరకు భక్తిశ్రద్ధలతో ర్యాలీ నిర్వహించి, అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏనుగుల రేణుక, మెంగలి కవిత, కముటం స్వప్న, మున్నిర, ఇందూరి సౌమ్యతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు..

## సీనియర్ కళాకారుడు వేముల పోచమల్లుకు ఘన నివాళి.. తెలంగాణ రాష్ట్ర కళాకారుల వేదిక సంతాపం

**కరపత్రం ప్రతినిధి వీణవంక ఆగస్టు 4:**
కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కనపర్తి గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ కళాకారుడు వేముల పోచమల్లు (70) సోమవారం రాత్రి కన్నుమూశారు. ఆయన మృతిచెందిన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కళాకారుల వేదిక ప్రతినిధులు మంగళవారం కనపర్తి గ్రామానికి చేరుకుని ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కళాకారులు గోనెల సమ్మన్న, నర్సింగోజు రవీంద్రచారి, పంజాల శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ వేముల పోచమల్లు తన జీవితాన్నే కళారంగానికి అంకితం చేసిన గొప్ప కళాకారుడని కొనియాడారు. పౌరాణిక, యక్షగాన, సాంఘిక నాటికలు, చిరుతల రామాయణం వంటి సంప్రదాయ కళారూపాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వాటి పరిరక్షణకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. గ్రామీణ కళలను సజీవంగా ఉంచడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, కళాకారులకు ఆదర్శప్రాయమైన వ్యక్తిగా నిలిచారని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్



కాంగ్రెస్ కమిటీ సాంస్కృతిక సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర కళాకారుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగోజు రవీంద్రచారి, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పంజాల శ్రీధర్ గౌడ్, జమ్మికుంట మండల అధ్యక్షులు వేముల అశోక్, వీణవంక మండల అధ్యక్షులు ముత్యాల హుస్సేన్ నాయి, కళాకారులు దాసరి కొమురెల్లి, కనపర్తి గ్రామ కళాకారులు, గ్రామ పెద్దలు, అభిమానులు తదితరులు పాల్గొని పోచమల్లుకు



ఘనంగా నివాళులర్పించారు.

## ఆగస్టు 7వ తేదీన ఓబీసీ మహాసభను విజయవంతం చేద్దాం.దొగ్గలి శ్రీధర్ పిలుపు




కరపత్రం ప్రతినిది కరీంనగర్
బెంగళూరు లో జరిగే బిసి రిజర్వేషన్ల అధ్యులు,బీసీలకు ఆరాధ్యులు బిపి మండల్ దే సందర్భంగా ఆగస్టు7 తేదీన అఖిలభారత జాతీయ ఓబిసి 11వ మహాసభను జ్ఞాన జ్యోతి ఆడిటోరియంలో వేదికగా చేసుకొని డాక్టర్ మన్మోహన్ సింగ్ సిటీ యూనివర్సిటీ సాక్షిగా దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని విస్తరించుదాం అని వృత్తులు వేరైనా, బీసీలమంతా ఒక్కటే అని, మేమెంతో మాకంతా దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమ రాజకీయ నిర్మాణం చేపడదాం అనే నినాదంతో గల్లీ నుంచి , గ్రామాల నుండి , మండలాల నుండి , జిల్లాల నుండి బిసి ఉద్యమకారులు తరలి రావాలని 11వ ఓబిసి మహాసభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు దొగ్గలి శ్రీధర్ పిలుపునిచ్చారు.

## హుజూరాబాద్‌లో బీజేపీకి భారీ షాక్.. బీఆర్ఎస్‌లోకి ముగ్గురు సర్పంచ్‌లు కేటీఆర్ సమక్షంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో చేరికలు

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్/హుజూరాబాద్, ఆగస్టు 4:**
హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఇల్లందకుంట మండలంలో భారతీయ జనతా పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. మండలానికి చెందిన ముగ్గురు గ్రామ సర్పంచ్‌లు బీజేపీకి రాజీనామా చేసి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో చేరారు. హైదరాబాద్ నందినగర్‌లో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో సిరిసేడు గ్రామ సర్పంచ్ కుమార్, వంతడుపుల గ్రామ సర్పంచ్ రాజేష్, టేకుర్తి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ ఉన్నారు. పార్టీ కండువా కప్పి వారిని కేటీఆర్ ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చేరిన సర్పంచ్‌లు మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో



ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బీజేపీ కూడా ప్రజా సమస్యలపై పోరాడకుండా రాజకీయాలకే పరిమితమైందని ఆరోపించారు .గ్రామస్థాయిలో కాంగ్రెస్, బీజేపీలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, అందువల్ల ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత మంది ప్రజాప్రతినిధులు, నాయకులు బీఆర్ఎస్‌లో చేరనున్నారని ధీమా వ్యక్తం చేశారు.తెలంగాణ ప్రజలు మరోసారి కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాలని



ఆకాంక్షిస్తున్నారని అన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతూ ప్రజల పక్షాన నిలుస్తున్నారని, ఆయన నాయకత్వంపై పూర్తి విశ్వాసంతోనే బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు.హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలం రోజురోజుకూ పెరుగుతోందని, త్వరలో కాంగ్రెస్, బీజేపీల నుంచి మరిన్ని కీలక చేరికలు ఉంటాయని పార్టీ నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వెంకటేష్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు పిడుగురాళ్లలో మండల రెవెన్యూ సదస్సు పిడుగురాళ్ల పట్టణ టిడిపి అధ్యక్షుడు పిల్లి చెన్నారావు వెల్లడి



కరపత్రం ప్రతినిధి
పిడుగురాళ్ల,ఆగస్టు04
పిడుగురాళ్ల పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం నందు నేడు (బుధవారం) ఉదయం 10 గంటలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పిడుగురాళ్ల మండల రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ పిడుగురాళ్ల పట్టణ శాఖ అధ్యక్షులు పిల్లి చెన్నారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు హాజరవుతారని చెన్నారావు తెలిపారు. ఈ సందర్భంగా చెన్నారావు మాట్లాడుతూ, పిడుగురాళ్ల మండల పరిధిలోని గ్రామాల నందు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు, వివాదాల పరిష్కారం కోసం పిడుగురాళ్ల పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం నందు నిర్వహించే ఈ కార్యక్రమంలో పరిష్కారం చూపడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల మండల పరిధిలో ఇప్పటికే నెలకొని ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం ఆయా గ్రామాలలో భూ సమస్యలు ఉన్న యజమానులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి పిడుగురాళ్ల మండల మరియు పట్టణంలోని తెలుగుదేశం, జనసేన మరియు బిజెపి పార్టీల నాయకులు, యువత, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

## ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధికి చర్యలు ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశంలో ఎమ్మెల్యే అరవింద బాబు

**కరపత్రం ప్రతినిధి నరసరావుపేట, ఆగస్టు 4:**
పల్నాడు జిల్లా నరసరావుపేట ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నరసరావుపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. ప్రస్తుతం దాదాపు 200 పడకలతో అన్ని విభాగాల్లో సర్జరీలు, ఓపీ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ నెలలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పర్యటన ఉన్న నేపథ్యంలో ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలపై చర్చించి మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకే హెచ్ డి ఎస్ సమావేశం ఏర్పాటు



చేసినట్లు చెప్పారు. పాత ఏరియా ఆసుపత్రి భవనాలను తొలగించి అక్కడ తల్లీబిడ్డల ఆరోగ్య సముదాయం నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు ఇప్పటికే నాబార్డు ద్వారా రూ.55 కోట్ల నిధులు మంజూరయ్యాయని, మంత్రి పర్యటన తర్వాత నిర్మాణ ప్రణాళికలను ఖరారు చేస్తామన్నారు. అలాగే రోగులకు తాగునీటి సరఫరా, రెస్ట్ రూమ్స్ ఏర్పాటుకు



సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. కలెక్టర్ పర్యవేక్షణలో ఈ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, కమిటీ సభ్యులు డాక్టర్ భారతీ దేవి, మిరియాల వెంకట సుబ్బమ్మ, తవ్వా మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏజీఎంను సత్కరించిన రేవా నాయకులు




కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్ (రామగుండం), ఆగస్టు 4:
నూతనంగా వచ్చిన ఎన్టీపీసీ హెడ్ ఆఫ్ హెచ్ఆర్ ఏజిఎం సాగర్ రంజన్ సాహును ఎన్‌టిపిసి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రేవా) కార్యవర్గం అధ్యక్షులు ఆకుల రామ్ కిషన్ ఆధ్వర్యంలో పరిచయ కార్యక్రమంలో సాహును శాలువతో సత్కరించారు. రిటైర్డ్ ఉద్యోగుల వసతి కోసం, వైద్యం విషయంలో జరుగుతున్న వాస్తవ విషయాలను వివరించి వారి సహకారాన్ని కోరారు. ఉద్యోగులతో సమానంగా రిటైర్డ్ ఉద్యోగులకు ఎలాంటి బేధం లేకుండా యాజమాన్యం చర్యలు తీసుకొంటుందని హామీ ఇచ్చారు. సాహు వారి సహకారం, ఆదరణ, సంక్షేమం పట్ల చూపుతున్న చొరవ నిజంగా ప్రశంసనీయం. వారు ఎల్లప్పుడూ ఇలాగే సేవాభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ.. వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు, శుభాకాంక్షలు ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో అధ్యక్షులు ఆకుల రాంకిషన్, కార్యదర్శి చెప్యాల శ్రీపతిరావు, రేవా సీనియర్ నాయకులు తిరుమల సురేందర్, దుర్గం నర్సయ్య, మంగళంపల్లి రాంనారాయణ, గోపాల్ రెడ్డి, డి.లాలయ్య, ఈ.వెంకటేశ్వర్లు, కొమ్ము గోపాల్, సాంబమూర్తి మరియు ఇతరులు పాల్గొన్నారు.

## కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిలి రమేష్ జన్మదిన వేడుకలు ఘనంగా శివాలయంలో అన్నదాన కార్యక్రమం -- గాంధీ చౌరస్తాలో కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేసిన యువత

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, ఆగస్టు 4:**
కేడీసీసీ బ్యాంక్ జిల్లా వైస్ చైర్మన్ పింగిలి రమేష్ జన్మదిన వేడుకలను జమ్మికుంట నియోజకవర్గ యువత ఘనంగా నిర్వహించింది. పట్టణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం గాంధీ చౌరస్తాలో కేక్ కట్ చేసి ప్రజలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువ నాయకులు మాట్లాడుతూ, పింగిలి రమేష్ ప్రజాసేవనే లక్ష్యంగా రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న నాయకుడని కొనియాడారు. 2001లో విలాసాగర్ గ్రామ యువ సర్పంచ్‌గా ప్రజాసేవ ప్రారంభించిన ఆయన, హమాలి కార్మిక సంఘం అధ్యక్షుడిగా, ఆర్టీసీ డిపో యూనియన్ అధ్యక్షుడిగా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ కార్మికులు, రైతులు, వ్యాపార వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు.కార్మికులు, కర్షకులు, యువత, పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలిచే నాయకుడిగా పింగిలి రమేష్ ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజాసేవలో మరింత ముందుకు



సాగాలని, ఆయురారోగ్యాలతో నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంది దిలీప్ రెడ్డి, యూత్ నాయకులు జెకె జోడు కుమారస్వామి, వొల్లాల శ్రీకాంత్ గౌడ్, పింగిలి మహేష్, పాత రాజేష్, రాకేష్, మహేష్, అభి, సురేష్, రావుల ఎల్లయ్యతో పాటు పలువురు యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

